క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

దుబ్బాక: ఏడో రాష్ట్రస్థాయి అండర్–14 రగ్బీ క్రీడా పోటీలకు దుబ్బాక మైనార్టీ గురుకులం విద్యార్థులు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 1 నుంచి మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఈ పోటీల్లో హర్షవర్ధన్, రఘువిత్‌రెడ్డి, మనీశ్, రాంచరణ్ పాల్గొంటారని జిల్లా రగ్బీ క్రీడల సెక్రటరీ అజయ్‌కుమార్ తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ విమలారెడ్డి, వార్డెన్ హమీద్, పీడీ షాదుల్, మానసతో పాటు అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఐ ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ముస్త్యాల గ్రామ గ్రంథాలయాన్ని ఎన్ఆర్ఐ పెడతల ప్రతాప్‌రెడ్డి బాలమణిరెడ్డి దంపతులు రూ.13 లక్షలతో నిర్మిస్తే గురువారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతాప్‌రెడ్డి తన తండ్రి ఎల్లారెడ్డి జ్ఞాపకార్థం గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ భవన నిర్మాణాన్ని సొంత ఖర్చులతో పూర్తిచేశారు. అందులోకి అవసరమైన పుస్తకాలు, ఫర్నీచర్‌ను సైతం సమకూర్చారు. పుట్టిన ఊరు బాగు కోసం ముందుకు రావడం అభినందనీయమని పల్లా అన్నారు. గ్రామ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెడతల యెల్లారెడ్డి, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): కుష్టు వ్యాధి నివారణపై గురువారం మండలంలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఆ మేరకు విద్యార్థులతో కలిసి వారు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ టి.విఠల్, టీచర్లు కృష్ణమూర్తి, శివకుమార్, విద్యా ప్రకాశ్, రామచంద్రం, ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు



వెంకట్రావుపేట శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించిన సీఐ దంపతులు

తొగుట(దుబ్బాక): పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మండలంలో ఉన్న వెంకట్రావుపేటలో వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో పాల్గొని బుధవారం రాత్రి సీఐ దంపతులు స్వామి వారికి పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని సూచించారు. తాను మతాలకతీతంగా అన్ని దేవాలయాలకు వెళ్లి దర్శించుకుంటామన్నారు.

మున్సిపల్‌లో బీజేపీ జెండా ఎగరాలి

గజ్వేల్‌రూరల్: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ పేర్కొన్నారని పార్టీ గజ్వేల్ మున్సిపల్ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ తెలిపారు. శామీర్‌పేటలో ఉన్న నివాసముంటున్న ఈటలను గురువారం బీజేపీ నాయకులు నర్సింహ, నాయిని సందీప్‌కుమార్‌లతో పాటు ఆయన కలిశారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, సమన్వయంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకట్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన కాంగ్రెస్



సిద్దిపేటరూరల్: నారాయణరావుపేటలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న నేతలు



హుస్నాబాద్: గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



జగదేవ్‌పూర్‌లో..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నేటికీ 420 రోజులు పూర్తి చేసుకున్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ జిల్లాలోని గాంధీవిగ్రహాలకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



గజ్వేల్: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు



సిద్దిపేట జోన్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



చేర్యాలలో..



చిన్నకోడూరులో..



అక్కన్నపేట(హుస్నాబాద్): రామవరంలో ..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ షేక్ మహబూబ్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఆయన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్, సీజ్ బెల్ట్‌ను ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను ఆర్థికంగా మానసికంగా కృంగదీస్తాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు



సాయి మూలవిరాట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం 28వ వార్షికోత్సవాన్ని ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నిర్వహించనున్నారు. ఇదే విషయాన్ని సాయిబాబా సేవా సంస్థాన్ ట్రస్ట్ సిద్దిపేట చైర్మన్ కొండకృష్ణమూర్తి, అధ్యక్షుడు గందే శ్రీనివాస్, కార్యదర్శి తడ్కమడ్ల నర్సయ్యలు గురువారం ధ్రువీకరించారు. మూడు రోజుల పాటుగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సెట్ బ్యాక్ లేక.. సాగని పనులు!

- ఏడాదిన్నరైనా అసంపూర్తిగా డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు
- ఇబ్బందుల్లో జనం
- అధికారులు చొరవ తీసుకోవాలని వేడుకోలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పట్టణ ప్రజలకు జాతీయ రహదారి విస్తరణ పనులతో కొత్త తిప్పలు తప్పడం లేదు. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారి వెంబడి నూతనంగా నిర్మించిన డ్రైనేజీ పనులు ఏడాదిన్నరైనా పూర్తి కాలేదు. దీంతో అసంపూర్తిగా ఉన్న చోట మురుగు నీరు చేరి దోమలకు నిలయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా ఐదు ఫీట్ల వెడల్పుతో కాల్వల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం పనులు మధ్యలో నిలిచి పోవడంతో అక్కడ మురుగు నీరు చేరింది. గతంలో రోడ్డు పక్కన వేసిన విద్యుత్ స్తంభాలు రోడ్డు వెడల్పులో భాగంగా డ్రైనేజీ మధ్యలోకి వచ్చాయి. అయితే పలు చోట్ల డ్రైనేజీ నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ నిలిపివేశాడు. దీంతో



అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీల్లో నిండిన మురుగు నీరు

పట్టణ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులు, పాలకవర్గం దృష్టికి స్థానికులు తీసుకెళ్లినా ఫలితం లేదు.

ఆగిన స్తంభాల తరలింపు

పట్టణంలో పలు చోట్ల నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులు సెట్ బ్యాక్ లేకపోవడం వల్లే నిలిచిపోయాయి. స్తంభాల తరలింపునకు విద్యుత్ అధికారుల నుంచి అనుమతులు వచ్చినప్పటికీ తొలగించిన స్తంభాలు వేయడానికి అడ్డంకులు ఎదురవుతుండటంతో పనులు సాగడం లేదు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయం చేసుకుని సెట్ బ్యాక్ చేసి స్తంభాలు తరలిస్తేనే పనులు ప్రారంభమవుతాయి.

వంద ఫీట్లకు నోటీసులు జారీ

పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు రోడ్డు మధ్య నుంచి రెండు వైపులా 50 ఫీట్ల చొప్పున 100 ఫీట్ల వరకు జరుగుతాయని, అందుకు అవసరమైన సెట్ బ్యాక్ కావాలంటూ అధికారులు, గత పాలకవర్గం, జాతీయ రహదారి విస్తరణ అధికారుల విన్నపం మేరకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ ఎక్కడా ఆచరణలో పెట్టినా దాఖలాలు లేవు. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెంటనే పనులు చేయిస్తాం

రోడ్డు విస్తరణ పనులు కొన్ని కారణాల వల్ల ఆలస్యమవుతున్నాయి. వెంటనే పూర్తి చేయిస్తాం.

– ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మోహన్

సమన్వయంతో పని చేయండి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: మున్సిపల్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డుల ప్రత్యేక అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సిద్దిపేట దిశగా ప్రతిఒక్కరూ పని చేయాలని సూచించారు. వార్డుల్లో బహిరంగ చెత్త లేకుండా చూడాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు వార్డుల్లో రోజూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డు ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలని, ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఖాళీ స్థలంలో చెత్త లేకుండా చూడాలని ఆదేశించారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటయ్యాయని, రోడ్డుపై చెత్త వేసే వారిని గుర్తించాలని, అవసరమైతే జరిమానా విధించాలన్నారు. రాత్రి సమయంలో పారిశుద్ధ్య పనులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆశ్రిత్ కుమార్

ముమ్మరంగా చేయాలని సూచించారు. జనాలు ఉండే ప్రాంతాల్లో, పార్కుల్లో, బస్టాప్‌లలో చెత్త సేకరణ డబ్బాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 31 నాటికి 100 శాతం పన్నులు వసూలు చేసేలా చూడాలన్నారు. కొత్తగా ఇంటి నిర్మాణం చేసే వారు నిబంధనలు పక్కాగా పాటించేలా చూడాలని, నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ డీఈ ప్రేరణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, మాధవి, ఆయా వార్డుల అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన యువరైతు మృతి



వెంకటేశ్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువ రైతు చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మీనాజీపేటకు చెందిన దుండిగల్ల వెంకటేశ్(32)కు భార్య హృదయరాణి, అజయ్ (12), యజ్ఞేశ్ (7) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయంతో పాటు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 12న సాయంత్రం తన బైక్‌పై తున్కిఖాల్సాకు బయలుదేరాడు. ఈ ప్రాంతం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే గాంధీకి తరలించగా బుధవారం రాత్రి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. 3 నెలల క్రితం అతడి తండ్రి యాదగిరి అనారోగ్యంతో మృతిచెందగా, ఇప్పుడు వెంకటేశ్ మృతి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించకూడదు



సిద్దిపేటకమాన్: జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: తల్లిదండ్రులు మైనర్ డ్రైవింగ్‌ను ప్రోత్సహించకూడదని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులతో పట్టణంలో రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై పోలీసు అధికారులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఏసీపీ సుమన్‌కుమార్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సూచించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, అతి వేగం, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్ చేయకూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు, సిబ్బంది జగదీశ్, మహేశ్, శ్రీనివాస్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారు వాహనాలు నడిపితే కేసులు

కొండపాక(గజ్వేల్): మైనర్లు వాహనాలను నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామంటూ గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కుకునూరుపల్లిలో హైస్కూల్ విద్యార్థులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు తప్పని సరిగా లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలను కలిగి ఉండాలన్నారు. నాలుగు చక్రాలను నడిపే వారు సీట్ బెల్ట్‌ను వేసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలను అతి వేగంగా డ్రైవ్ చేస్తూ ప్రమాదాలను తెచ్చుకోవద్దన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయడం అన్నింటా శుభదాయకమన్నారు. ఆటోవాలాలు పరిమితులకు మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదన్నారు. కార్యక్రమంలో సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, ఎంఈఓ బచ్చలి సత్తయ్య, ఉపాధ్యాయులు, పోలీసులు, వాహనదారులు పాల్గొన్నారు.

ముర్షద్‌గడ్డ దర్గాలో దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముర్షద్‌గడ్డ దర్గా ఉత్సవాల రెండోరోజైన గురువారం దీపారాధన కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. అనంతరం భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వృత్తికి మచ్చ తెస్తే సహించం

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్



డైరీని ఆవిష్కరిస్తున్న విరాహత్‌అలీ

గజ్వేల్‌రూరల్: సమాజం పట్ల అవగాహన లేని కొందరు జర్నలిస్టులమని చెప్పుకొంటూ ఈ వృత్తికి మచ్చ తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి చర్యలను సహించేది లేదని టీయూడబ్ల్యూజే (తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు కే. విరాహత్‌అలీ హెచ్చరించారు. గురువారం గజ్వేల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ జర్నలిస్టుల సమావేశంలో యూనియన్ డైరీని ఆవిష్కరించారు. జర్నలిస్టుల పేరుతో కొన్ని అసాంఘిక శక్తుల ఆగడాలు మితిమీరిపోతున్నాయన్నారు. అధికారులు, ప్రజలను బ్లాక్ మెయిల్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు దృష్టికి వచ్చిందన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

సిద్దిపేటజోన్: స్థానిక 4వ వార్డులో ఒక ప్రభుత్వ ఉద్యోగి రోడ్డుకు అడ్డంగా ఇంటి నిర్మాణం చేస్తున్నాడని చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. గత నెలలో అక్రమ నిర్మాణం గురించి ఫిర్యాదు చేశామని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుప్రజలకు రోడ్డు సౌకర్యం ఉండేలా చూడాలని కోరారు.

బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలి

గజ్వేల్‌రూరల్: ప్రజా యుద్ధనౌక గద్దర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ క్షమాపణలు చెప్పాలని టీయూజేఏసీ (తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ) చైర్మన్ సుల్తాన్ యాదగిరి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పద్మ అవార్డుల సందర్భంలో గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యమకారులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, అలాగే రూ.30 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, చంద్రన్న, ప్రసాద్, అంజలి, యాదగిరి, గంగిరాజు, రాజయ్య, మహ్మద్‌సుల్తానా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌ను కేంద్ర సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం గద్దర్ జయంత్యుతోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ.. గద్దర్ సేవలను కొనియాడారన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిపై సంజయ్ అనుచితంగా మాట్లాడడం సరికాదని హితవుపలికారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే గద్దర్ జయంతి సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు ఏగొండ స్వామి, వేణు, చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం హరీ!



చెట్లను తొలగిస్తున్న జేసీబీ , ఇన్‌సెట్‌లో అదుపులో తీసుకున్న అటవీ అధికారులు

ఏళ్ల నాటి చెట్లను జేసీబీతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలగిస్తున్నారు. విషయం తెలుసుకున్న కొందరు రెవెన్యూ అధికారులు హుటాహుటిన వెళ్లి పనులను అడ్డగించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు ఇక్కడికి చేరుకొని స్వాధీనం చేసుకున్నారు. కొండపాక నుంచి తిమ్మారెడ్డిపల్లి వయా హైదరాబాద్‌కు వెళ్లే రాజీవ్ రహదారి పక్కన ఈ ఉదంతం వెలుగు చూసింది.

– కొండపాక(గజ్వేల్):